
# సౌమ్య



కుసుమా రంగారావు

పిల్లలు భోజనంచేసేసి చదువుకుంటున్నారు. సౌమ్య కొడుకు ఆకలయి కాబోలు ఏడుస్తున్నాడు. వాడికి పాలు పట్టి పడుకోబెట్టాను. పసివాడు నిద్రలో నవ్వుకుంటున్నాడు. నవ్వుతుంటే అచ్చు సౌమ్యలాగే ఉన్నాడు. మధ్యాహ్నమనగా వెళ్లింది సౌమ్య ఎవర్నో స్నేహితురాల్ని చూడాలంటూ. ఇంకా రాలేదు. ఎప్పటికి వస్తుందో? సౌమ్య — నా ప్రాణ స్నేహితురాలు. మా స్నేహం నిన్నా మొన్నటిదీ కాదు.

మా ఊరి విజయనగరం కాలేజీలో ఇంటర్మీడియెట్ క్లాసులో దాదాపు పదిహేనుమంది ఆడపిల్లలం ఉండే వాళ్లం. అందరమూ కలిసికట్టుగా ఉండేవాళ్లం.

కానీ అందరికన్నా నేను, విజయ, సౌమ్య మరీ సన్నిహితంగా, చనువుగా, ఆప్యాయంగా ఉండేవాళ్లం. లైబ్రరీకి వెళ్లినా, సినిమాకి వెళ్లినా, షికారుకు వెళ్లినా కలిసి వెళ్లేవాళ్లం. సౌమ్యవాళ్ల ఇల్లు, మా ఇల్లు పక్క పక్కనే ఉండేవి. విజయ ఇల్లు కాస్త దూరంగా ఉండేది. అందుచేత కాలేజీలోనే కాకుండా మిగిలిన సమయాలలో కూడా మే మిద్దరం ఒక్కచోటే చదువుకుంటూ, నవ్వుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ గడిపేవాళ్లం. అందువల్ల మా మధ్య మరింత సాన్నిహిత్యం ఏర్పడింది. మాలో ఎటువంటి మోహమాటాలు, దాపరికాలు, పింకోచాలు ఉండేవి కావు. సౌమ్య నాన్నగారు కంట్రాక్టరు. బాగా ఉన్నవాళ్లు.

ఆ ఏడు చాలా మందిమి ఇంటర్ పాసయ్యాము. తరవాత ఏం చదవాలన్నది పెద్ద సమస్య కాలేదు. మాలో కొంతమంది చదువుకి ఉద్వాసన చెప్పారు. కొంత మంది డిగ్రీ క్లాసుల్లో చేరిపోయారు. మేం ముగ్గురం మెడిసిన్‌కి అప్లై చేశాము. వైజాగ్ మెడికల్ కాలేజీ ఇంటర్వ్యూ పిలుపులు అందాయి. అంతులేని సంతోషంతో, భవిష్యత్తుపై తీయని ఊహలతో మేము మెడికల్ కాలేజీలో చేరి, హాస్టల్ జీవితానికి అలవాటు పడిపోయాము.

అప్పటి మాలో సౌమ్య చాలా అందంగా ఉండేది. సౌమ్యది మంచి ఆకర్షణీయమైన విగ్రహం. చక్కటి రంగుతో, విశాలంగా మెరిసే కళ్లతో, తీర్చిదిద్దిన ముఖ కవళికలతో మనోజ్ఞంగా ఉండేది. పైగా, ఎంతో చలాకీగా, తెలివిగా ఉండేది. హుషారుగా నవ్వుతూ, నవ్విస్తూ కబుర్లు చెప్పే సౌమ్యతో ఎవరైనా విసుగు లేకుండా గంటలకొద్దీ గడపవచ్చు.

ఫస్టియర్ అయిపోయింది.

అన్నయ్య ఉన్నపాటున రమ్మని వైర్ ఇచ్చాడు. నా చిన్నతనంలోనే అమ్మ పోయింది. నాన్న నేను స్కూలుఫైనలులో ఉండగానే నా బాధ్యత అన్నయ్య చేతిలో పెట్టి అమ్మను కలుసుకున్నారు. అప్పటికే మా అన్నయ్యకు పెళ్లి అయిపోయింది. మా వదిన కూడా నన్ను ప్రేమగానే చూచేది. ఆమె ఎవరితోనూ ఆట్టే మాట్లాడదు. కానీ నన్ను పన్నెత్తి ఒక్క మాట కూడా అని ఎరగదు. ఆవిడ మౌనం నన్ను కాస్త దూరంగా ఉండేలా చేసినా, ఒక విధమైన బెరుకు కలిగించినా, మా మధ్య అభిమానం మటుకు ఉండేది. మాకు పెద్దగా ఆస్తిపాస్తులు లేకపోయినా, అవసరాల కన్నా కొంచెం ఎక్కువగానే ఉండేది డబ్బు.

విజయనగరానికి బయలుదేరి, ఇల్లు చేరుకున్నాను.

---

**కొన్ని కొన్ని రహస్యాలు సజీవ రహస్యాలుగానే ఉండిపోతాయి...వాటిని కాలం కప్పివేయదు. అవి మరుపు మడతల్లో దాగవు. అదే 'సృష్టి' రహస్యం. భార్యా భర్తల మధ్య ఎంత అన్యోన్యం, అనురాగం, ప్రేమ ఉన్నా... ఒక్క విషయంలో ఇష్టంగానో, అయిష్టంగానో 'కాలు' జారితే, వెంటనే విధి కాటు వేస్తుంది. ఎవరిది కానీ...లోపం లోపమే గదా!**

---

అన్నయ్య పక్కమీద పడుకుని ఉన్నాడు. నా కెంతో భయంవేసింది, ఏమయిందా అని. అన్నయ్య జ్వరమని చీదడం నేను ఎరగను. ఎప్పుడూ ఆరోగ్యంగా, బలంగా ఉంటాడు. వదిన్ని ఏమయిందని అడిగాను. వదిన క్లుప్తంగా "హార్ట్ ఆటాక్" అన్నది. చాలా చిన్న తనంలో ఇది వచ్చిందని డాక్టర్లు అన్నారుట. జబ్బులు ఎప్పుడూ వైద్యశాస్త్రాల్లో వర్ణించిన నిబంధనలకు కట్టుబడి ఉండవనుకుంటాను.


మధ్యాహ్నం అన్నయ్య నన్ను పిలిచాడు. వదిన అన్నయ్య గదిలోనే పళ్లరసం తీస్తూంది. అన్నయ్య మంచం మీద జరుగుతూ "ఇలా వచ్చి కూర్చో, వసూ" అన్నాడు.

నేను మంచం చివర కూర్చున్నాను. ఎంత నిగ్రహించుకుందామనుకున్నా, కళ్లు ఊరికే నిండుతున్నాయి. అన్నయ్య చూస్తాడేమోనని భయపడుతూ తల వంచుకు కూర్చున్నాను.

అన్నయ్య పక్కకు ఒత్తిగిలి పడుకుంటూ, నెమ్మదిగా నా వీపు నిమురుతూ, "వసూ, నేనో విషయం చెబుతాను. దాన్ని నీవెలా తీసుకుంటావో? — కానీ పరిస్థితులు ఇలా వచ్చాయి. చూశావుకదూ? మరి ఏం చెయ్యను?" అన్నాడు బాధపడుతూ.

వదిన రసం గ్లాసు బల్లమీద పెట్టి, తొక్కలు తీసుకొని పారవేసేనెపంతో బయటకు వెళ్లింది. వదిన ఎక్కువగా చదువుకోలేదు. కానీ ఆమెలో పైకి కనిపించని సంస్కారం, సంయమనం ఒక్కోసారి ఎంతో ఆశ్చర్యం కలిగిస్తాయి. అందుకే ఆమె అంటే నాకు చెప్పలేని గౌరవం, భక్తి.

అన్నయ్య సరిగ్గా పడుకుని, "వాసవీ, నేను చెప్పబోయే విషయం జాగ్రత్తగా విని, ఆలోచించి నాకు సమాధానం చెప్పు. నీవు డాక్టరువు అవ్వాలనే పెళ్లి చేయకుండా వైజాగ్ పంపేను. నీ కోర్సయ్యాక నీ ఇష్టప్రకారం జరపాలనుకున్నాను. కానీ అన్నీ మనం అనుకున్నట్లు జరగవు కదూ? రాయిలా తిని తిరుగుతున్న నాకు హఠాత్తుగా ఈ గుండెజబ్బు వచ్చింది. అంటే ఇక మృత్యువు చాలా సమీపానికి వచ్చి నిలుచున్నదన్న మాట. ఏ నిమిషానన్నా నేను లేకుండా పోవచ్చు. అంతేకదా?! నీవు బాధపడకు, వసూ—అలా అని నేను ఇప్పుడే చచ్చిపోతానని అనుకోకు. ఇలాగే ఇంకో యాభై ఏళ్లు బ్రతికినా బ్రతకవచ్చు. కాకపోతే గ్యారంటీ చాలా తక్కువ. అపాయం ఎక్కువ. అలాంటప్పుడు ఈ ఇబ్బంది నీవు ఎదుర్కోకూడదు. నాన్న అప్పగించిన బరువు, బాధ్యతలు తీర్చుకున్నానని నాకు తృప్తి ఉండాలి. నీకో స్థిరమైన బ్రతుకుబాట నిర్ణయించానన్న శాంతి ఉండాలి నాకు. చదువుకుంటున్నావని, చదువు పూర్తి చేసుకుంటావని ఉపేక్షించుదామంటే నా మనస్సు ఒప్పుకోడం లేదు. నీకు పెళ్లిచేసి ఓ అయ్యచేతిలో పెడితే నేను నిశ్చింతగా ఉండగలను. నీ భర్త ఇష్టపడితే నీకు మెడిసిన్ నేను చెప్పిస్తాను. కాకపోతే నీవు అప్పుడు చదివినా చదవకపోయినా నాకు పెద్ద బాధ ఉండదు. కానీ నీ జీవితం ఓ గాడిలో పడుతుంది. నీవు నన్ను మన్నించు. ఇందులో నా స్వార్థమే ఎక్కువనుకో, కానీ నా స్థితి, నా బలహీనతకూడా నీవు మరిచిపోకూడదు. నీవు సంతోషంగా ఒప్పుకుంటే నా పని చాలా సులువవుతుంది. నాకు ఎంతో శాంతి ప్రసాదించినదానివవుతావు. వెళ్లు, వసూ, ఆలోచించి చెప్పు" అన్నాడు అలసటగా కదులుతూ.



మహాత్ముడు

చిత్రం—బి. దానియేల్ (ఖర్గపూర్)

నా గుండెలు పిండినట్లయింది. ఏం చెప్పను? జబ్బుతో బాధపడుతూ, జీవనజ్యోతి ఎప్పుడు ఆరిపోతుందోనని భయపడుతున్న అన్నయ్యను ఎలా ఓదార్చను? ఎలా చిన్నబుచ్చను? డాక్టరు నవుదామని సుందరంగా నిర్మించుకున్న ఆశాసౌధాన్ని ఎలా తోసివేయను?

వదిన నా గదిలోకి వచ్చి ఏదో సర్దుతూంది. అది కల్పించుకున్న పనేనని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. వదిన "వాసవీ, మీ అన్నయ్య నీకోసం చాలా బాధ పడుతున్నారు. నీవు పెళ్లిచేసుకొని ఆయన్ని సంతోషపెట్టు. ఆయనకోసం నిన్ను ప్రార్థిస్తున్నాను" అంది నా చేతులు పట్టుకొని. ఎంతో గంభీరంగా ఉండే వదిన అలా బేలగా నీళ్లు నిండిన కళ్లతో నిలుచున్న తీరు నన్ను కదిపివేసింది. వదిన కన్నీళ్లు చూడడం నా కదే మొదలు.

నా అంగీకారంతో రాజశేఖరంగారితో నా వివాహం వైభవంగా జరిగిపోయింది. అన్నయ్య, వదినల కళ్లలో కదిలిన తృప్తి నా కెంతో ఆనందం కలిగించింది. శ్రీవారి ప్రేమానురాగాలు, పై చదువుపట్ల అత్తమామల మౌనం — వారిని వదిలి దీర్ఘమైన ఐదు సంవత్సరాల చదువు పట్ల అనుకోకుండా ఏర్పడిన నిరసన నా చదువుకు స్వస్తివాచకం పలికించాయి. మొదట్లో కాస్త కష్టంగా తోచినా, తరవాత జీవితంలో నే నెప్పుడూ డాక్టరు నవలేదు కదా అని బాధపడలేదు. తప్పటడుగు వేశానేమో నన్న కించ నాకు ఏర్పడలేదు. రాజశేఖరం గారి ఆదరణ, వెంటవెంటనే పుట్టుకు వచ్చిన పిల్లల మీద ఏర్పడిన మమత నన్ను వెనక్కి తిరిగి ఆలోచించుకోనివ్వలేదు. నాకు కావలసినంత తృప్తి, శాంతి లభించాయి.

కానీ సౌమ్య నన్ను చాలా మాట లంది. వట్టి మూర్ఖురాలినని అంది. పరిస్థితులకు తలవంచిన బానిస నంది. కనీసం తనకోసం, తనకు తోడుగా ఉండేందుకన్నా చదవమని బ్రతిమాలింది. కసురుకుంది. విసుక్కుంది. కానీ తన తిట్లకూ, దీవెనలకూ, అభియోగాలకూ నా నవ్వే సమాధానమయింది. అంతటితో

మా స్నేహం ఇంకిపోలేదు. ఉత్తరాల ద్వారా అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంది. ప్రతి సెలవలకు సౌమ్య ముందుగా మా ఇంటికివచ్చి, విజయనగరంలో వాళ్ల ఇంటికి వెళ్లేది. కాలేజీ విషయాలు, తన చదువు, రోగుల మనస్తత్వాలు—ఒకటేమిటి, సౌమ్య రాయాలనిపించినవన్నీ వ్రాసేది. నా సంసారం, నా పిల్లల చిలిపి కయ్యాలు, చిన్నారి మాటలు నేను వ్రాస్తూండేదాన్ని.

ఆరేడేళ్లు కాలగర్భంలో కలిసిపోయాయి. వారి ఉద్యోగ రీత్యా హైద్రాబాద్ చేరుకున్నాము. అన్నయ్యకో కొడుకు పుట్టాడు. సౌమ్య డాక్టరు పట్టా పుచ్చుకుని, ఫామిలీ ప్లానింగ్ ఆఫీసరుగా ఉద్యోగం సంపాదించింది. వాళ్ల నాన్నగారి దగ్గిరే ఉద్యోగంచేస్తున్న ఇంజనీరును ప్రేమించి పెళ్లాడింది. సౌమ్య భర్త కృష్ణమోహన్ చక్కనివాడు. సరసుడు. అన్నివిధాల సౌమ్యకు తగినవాడు. సౌమ్య అదృష్టవంతురాలు. అపారమైన అందచందాలు, చదువు సంధ్యలు, సిరిసంపదలు, ప్రేమించే



స్వతంత్రోత్సవం
చిత్రం—ఆర్. ఎస్. వి. సుందర్
(హైదరాబాదు-20)

భర్త—అన్నీ లభ్యమయ్యాయి. వాళ్లను చూసినప్పుడల్లా నా మనస్సు ఆనందంతో మునకలు వేస్తుంది. మా విజయ అనాటమీతో అయిదారుసార్లు ఓడిపోయి, ఇక లాభం లేదని పెళ్లిచేసుకొని స్థిరపడిపోయింది. మా ముగ్గురి కలలు, ఊహలు సౌమ్య రూపంలో తీరుతాయని అనిపిస్తూంది!

నాలుగయిదు కాలెండర్లు మారిపోయాయి.

సౌమ్య, కృష్ణమోహన్‌లు కూడా హైద్రాబాద్ వచ్చారు. సౌమ్యకు ఫామిలీ ప్లానింగ్ డాక్టరుగా మంచి పేరుప్రతిష్ఠలు వచ్చాయి. కానీ సౌమ్యకు పిల్లలు పుట్టలేదు. అది తనకు చాలా పెద్ద దిగులుగా ఉండేది. కృష్ణమోహన్‌కు పిల్లలంటే మహా ఇష్టం. మా ఇంటికి ఎప్పుడు వచ్చినా పెద్దవాళ్లను వదిలేసి అతను మా పిల్లలతో ఆడుకుంటూ, కబుర్లు చెబుతూ ఉండేవాడు. మా పిల్లలు కూడా ఆయన్ని చూస్తే చాలు, వదలకుండా మీదపడి తెగ తొక్కేవారు. నేను వాళ్లను కోప్పడినా ఊరుకునేవాడు కాడు. "నేను వీళ్లకోసమే మీ ఇంటికి వస్తున్నాను సుమండీ" అనేవాడు నన్ను వారిస్తూ.

అసలు చిన్నప్పటినుంచి సౌమ్యకు పిల్లలంటే ఆపేక్ష. చుట్టుపక్కల పిల్లల్ని అందరినీ చేర్చి వాళ్లకు తలలు దువ్వి, రకరకాలుగా అలంకరించి, బొమ్మల కొలువులో బొమ్మల్లా కూర్చోబెట్టి, వాళ్లతో ఆటలాడించి, పాటలు పాడించి తెగ మురిసిపోయేది. మహా సరదా పడిపోయేది. అందులో చూడ ముచ్చటగా, చక్కగా, బొద్దుగా రబ్బరుబొమ్మల్లా ఉండే పిల్లలంటే మరీ సంబరపడిపోయేది.

పెళ్లి అయిన మరు సంవత్సరం నుంచి పిల్లలకోసం ఎదురుచూస్తూంది. అందుకనే ఈ ఆలస్యం మరీ భరించలేనట్లు తయారయింది. ఉత్తరాల్లో కూడా పిల్లలకోసం తన బాధ ఎంతో ఇదిగా వర్ణించి వ్రాస్తుండేది. నేను మందలిస్తూ, "ఫరవాలేదు, ఏం తొందర? ఇప్పుడే ఎందుకు పిల్లలు? నీవేమన్నా ముసలిదానివయిపోయావా? నీ వయస్సు మించిపోతుందని భయమా? కొన్నాళ్లు సరదాగా మీ రిద్దరూ గడపండి. తరవాత పిల్లల జంజాటం ఎలాగూ తప్పదు. ఇప్పటినుంచే ఎందుకు బాధపడతావు?" అని వ్రాసేదాన్ని కానీ సౌమ్య అలాగే వాపోతూండేది.

కృష్ణమోహన్ రెండుమూడుసార్లు "సౌమ్యగారూ, మీ ఫామిలీ ప్లానింగ్ హాస్పిటల్ వరకే పరిమితం. మనకూ దానికీ చాలా దూరం—తెలుసు కదూ?" అన్నాడట. సౌమ్య అలా అన్నాడని నాతో చెప్పి చాలా బాధపడింది.

"చూశావా, వసూ, తనకు పిల్లలు కావాలని ఎంత సున్నితంగా చెప్పారో? ఆఖరికి మా పనిమనిషి పిల్లని కూడా ఆడిస్తూంటారు. ఏం చెయ్యను? పిల్లలవైపు ఎలా ప్రేమగా, జాలిగా నవ్వుతూ చూస్తారనుకున్నావు? ఆ నవ్వు, ఆ కళ్లలో కనిపించే మమతా మాధుర్యం నాకు మతి పోగొడుతున్నాయి" అని అన్నది.

సౌమ్య కృష్ణమోహన్‌ని అమితంగా ప్రేమించేది. వాళ్లు నా దృష్టికి భార్యాభర్తల్లా కాకుండా ప్రేమికుల్లా కనిపించేవారు. పిల్లలు కావాలని సౌమ్య ఎంత కోరుకున్నా, కృష్ణ కోరిక తీర్చలేకపోతున్ననే అని ఎక్కువగా బాధపడేది. సౌమ్యకు ఒక్క పాప పుడితే ఎంత బాగుంటుంది? వాళ్ల ఆనందానికి అవధు లుంటాయా? "భగవాన్! వాళ్ల కోరిక ఎంత సహజమైనది? అన్నీ ఇచ్చిన నీవు ఈకాస్తదానికి వెను దీస్తావా? నీ అనంత కరుణామయ దృష్టిలో ఈ రవంత లోపం దేనికి, ప్రభూ? — వాళ్లకు ఆ ఒక్క వరమూ ప్రసాదించి ధన్యుల్ని చేయి, తండ్రీ!" సౌమ్య కోసం ఆర్ద్రమైన నా హృదయం మూగగా ప్రార్థించేది.

సౌమ్య ఒక రోజున "వాసవీ, నేను ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేస్తున్నా. వెధవ ఉద్యోగం — వెధవ బ్రతుకు" అంది చిరాగ్గా.

నేను, "అదేం — నీకేదో సెంట్రల్ గవర్నమెంటులో పెద్ద గ్రేడూ, ప్రమోషనూ రాబోతూం దన్నావు. ఇప్పుడు రిజైన్ చేస్తానంటున్నావు! నీకేమన్నా పిచ్చా ఏమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

సౌమ్య, "ఊరుకో, వాసవీ. ఆ ఫామిలీ ప్లానింగ్ మాట ఎత్తకు. నా తల కంపర మెత్తుతూంది. వెధవ మాట విని విని నా ప్రాణం విసిగి వేసారిపోయింది. నా చుట్టూ ఆ ముక్క తప్ప మరో మాట వినబడటం లేదు. ఇంక నాలుగు రోజులు పోతే నోరులేని రాళ్లూ, గోడలూ కూడా ఫామిలీ ప్లానింగ్ అని అరిచేలా ఉన్నాయి. ఈ పాడు మాటే నా జీవితానికి కూడా శాపంలా సంక్రమించేలా ఉంది. పాడు దరిద్రం ఎంత వినకుండా తప్పించుకుందామన్నా తప్పడంలేదు" అంది విసురుగా.

నాకు సౌమ్య బాధకు ఒకవైపు జాలి, ఒకవైపు నవ్వు వచ్చాయి. నిజమే మరి. తను ఫామిలీ ప్లానింగ్ ఆఫీసరు. ఎందరికో పిల్లలు పుట్టకుండా ఉండే పద్ధతులు, విధానాలు చెబుతుంది. శాశ్వతంగా వాళ్లకు సంతాన యోగం లేకుండా నేర్పుగా ఆపరేషన్ చేస్తుంది. తన సర్వీస్‌లో ఒక్క ఫెయిల్యూర్ తటస్థించలేదు. కానీ చిత్రంగా ఏ పద్ధతులు, నిబంధనలు లేకుండా తను కూడా కుటుంబ నియంత్రణ అవలంబిస్తూంది! మనసా, వాచా పిల్లలకోసం తపిస్తూంది! కానీ పిల్లలు కలగడం లేదు. ప్రకృతి తన ప్రభావం చూపుతూంది. దానికి మనస్సుతో, శరీరంతో ప్రమేయం లేదా? అంటే సుప్రసిద్ధమైన ఫామిలీ ప్లానింగ్ డాక్టరు గారికి పిల్లలమీద అమితమయిన మోజు. కాని, ఆమెకు ఎంతగా కోరుకున్నా పిల్లలు పుట్టడంలేదు.

మళ్లీ అందుకొని సౌమ్య "నేను చేసిన వెధవ ఆపరేషన్లు, నే నిచ్చిన బోడి సలహాలు నన్నీవిధంగా పీడిస్తున్నాయి. ఇందులో ఏదో దోషం ఉంది. అవన్నీ కలిసి నన్ను శపించాయి. అందుకే ఇలా నిస్సంతుగా, గొడ్రాలిగా మారిపోయాను. ఆ పాపమే నన్ను పరిహసిస్తూంది. నా బ్రతుకంతా "డాక్టరుగారూ, ఇక నాకు పిల్లలు వద్దు. ఏదన్నా మార్గం చూపరూ? డాక్టరుగారూ మళ్లీ నెల తప్పింది. ఈ గర్భం తీసివేయరూ? డాక్టరుగారూ నాకు శాశ్వతంగా పిల్లలు లేకుండా చేయరూ?" అనే మాటలు వింటూ గడిచిపోతున్నది. ఇరవై నాలుగు గంటలు ఈ ఛండాలపు మాటలు విని విని నా మనసు కూడా మూగబోయింది. అందుకనే ఈ శరీరంకూడా ఇలా తయారయింది. నీకు తెలియదు, వసూ, సైకలాజికల్ ఇన్స్పిరేషన్ శరీరం మీద చాలా తీవ్రంగా ఉంటుంది సుమా?" అంది.

పిల్లలు లేరన్న బాధ తన్ను పీల్చి పిప్పిచేస్తుంది. అందుకే తన ఆలోచనారీతి తీవ్రంగాను, కొంత చాదస్తంగాను ఉంది.

కొంతన్నా ఊరట కలిగించాలని, "చాల్లే, నీ మెట్ట వేదాంతం. మన క్లాస్‌మేటు విశాల ఫామిలీ ప్లానింగ్ సెక్షన్ ఎ. ఐ. ఆర్. లో పనిచేస్తుంది. తను అస్తమానం కుటుంబ నియంత్రణ పథకం ప్రచారం కొరకు పాటలు, డ్రామాలు రేడియోలో ప్రసారం చెయ్యాలని ఆలోచిస్తూ, రాస్తూ ఉంటుంది. తనకు అయిదుగురు పిల్లలు. మరి దాని కేమంటావు? మెంటల్‌గా తను కూడా నీలానే పనిచేస్తూందికదా?" అన్నాను. మళ్లీ, "సౌమ్యా, నేను నీకు చెప్పక్కర్లేదనుకో. కానీ మనస్సూరుకోవడం లేదు. నీవు ఎవరన్నా మంచి అనుభవమున్న డాక్టర్ని సంప్రదించకపోయావూ?" అన్నాను.

సౌమ్య నిట్టూరుస్తూ "అన్నీ అయ్యాయి. ఏ లోపమూ లేదన్నారు. వెధవ విజ్ఞానం, ఎందుక

వచ్చిన శాస్త్రాలు, సైన్సూ, పరిజ్ఞానం — అంతా బూష్. ఏదీ ఈ మహామహులందరు తమ విజ్ఞానం ఉపయోగించి నా లాంటి గొడ్రాలికి ఒక బిడ్డ కలిగే టట్టు చెయ్యమను? — చూద్దాం. వీళ్ల తరంగాదు. ప్రకృతిపరమైన ఈ మహాశక్తుల్ని ఎన్నటికీ జయించ లేము'' అంది.

సౌమ్య మాట్లాడే ధోరణి నాకు చాలా చిత్ర మనిపించింది. మరీ పిచ్చిదానిలా వాదిస్తూంది. ఇంతటి మూర్ఖత్వం సౌమ్యలో నే నెన్నడూ చూడలేదు. ఇక వాదన పెంచకుండా, ''చాల్లే, అలిసిపోయావుగానీ, కాఫీ ఇస్తాను. వంటింట్లోకి రా'' అన్నాను లేస్తూ.

వంట ఇంట్లోకి వెళ్లే సరికి పొరపాటుగా కింద వదిలేసిన పచ్చడిజాడీ, కాఫీ పొడి డబ్బా కలిసిపోయాయి. మా చిన్న ఆ మిశ్రమాన్ని ఒళ్లంతా పాముకొని ఆనందంగా నవ్వులు కురిపిస్తూ కనిపించాడు.

సౌమ్య వాణ్ణి అమాంతం ఎత్తుకుని ముద్దు పెట్టు కుంటూ, ''వసూ, అప్పు డప్పుడూ ఎవరి పిల్లనన్నా పెంచుకుందా మనుకుంటా ను. కానీ మనస్సు ఒప్పడం లేదు. నా రక్తం పంచు కుని పుట్టిన పాపే నాకు కావాలి. ఎవరో కన్న బిడ్డను నేను ప్రేమించి పెంచి పెద్దచేసి, నా ప్రాణంగా చూసుకోగలనా? నా కంతటి ఉదాత్తత లేదే — ఏమైనా సరే ఉద్యోగం మానేస్తాను. ప్రైవేటు ప్రాక్టీసు పెట్టు కుంటాను. కుటుంబ నియంత్రణ అనే మాటలు దగ్గరికి రానీయకుండా చూసుకుంటాను. అప్పుడే నా మనస్సుకి ప్రశాంతి'' అంది.

సౌమ్య అన్నంత పనీ చేసింది. ఉద్యోగానికి రాజీ నామా ఇచ్చేసింది. కృష్ణ మోహన్ మరో భాగస్తుడితో కలుపుకొని ''ఇంజనీర్స్ అండ్ కంట్రాక్టర్స్'' అని స్వంతంగా ఓ కంపెనీ పెట్టాడు. కొత్తగా పెట్టిన కంపెనీ అవడం వల్ల అతను తీరిక అనేది లేకుండా ఉన్నాడు.

నాకు ఆరోగ్యం అంత బాగుండడం లేదు. తరచు జ్వరం, ఒళ్లు నెప్పులు, అజీర్ణం — ఏదో ఒకటి. స్థలం మారితే బావుంటుందని అనుకున్నాము. సౌమ్య కూడా మాతో బయలుదేరింది. నా కెంతో సంతోషం కలిగింది. నా మనస్సు కృతజ్ఞతతో నిండిపోయింది. నా సౌమ్య ఎంత మంచిది? నా ఆరోగ్యంకోసం, నన్ను అహర్నిశలూ కనిపెట్టి ఉండడం కోసం తనూ వస్తూంది! నా మీద ఎంత ప్రేమ? తన ఋణం నేను ఎలా తీర్చగలను? మంచి స్నేహం ఓ వరం లాంటిది. భగవంతుడు దయాసముద్రుడు. ఇంతటి స్నేహితు రాల్ని ప్రసాదించాడు. కానీ ఆ దైవమే నా సౌమ్యను కరుణించలేదు.

అక్కడక్కడ తిరుగుతూ రెండు మూడు నెలలు గడిపాను. నా ఆరోగ్యం కుదుటపడింది. సౌమ్య కృష్ణను చూడాలనిపిస్తూందని చెప్పి వెళ్లిపోయింది. నేను ఏమీ అభ్యంతరం పెట్టలేదు. నెల్లాళ్ళ కంటికి రెప్పలా కాపాడి నకు సేవచేసింది. అంతకన్నా ఏం కావాలి?

సౌమ్య హైద్రాబాదంటే మొహం మొత్తిపోయిం దని విజయనగరం వెళ్ళిపోయింది. అక్కడే ప్రాక్టీసు పెట్టుకుంటానంది. కృష్ణమోహన్ విజయనగరంలో కొన్నాళ్ళు, హైద్రాబాదులో కొన్నాళ్ళు ఉండేవాడు. సౌమ్య వెళ్లిపోయాక నాకు మతి పోయినట్లుండేది. అస్తమానం గుర్తు వస్తుండేది. వెనకటిలా ఉత్తరాలు కూడా వ్రాయడం లేదు. కొత్త ప్రాక్టీసు కనుక తీరడంలేదేమోనని సరిపెట్టుకున్నాను.

నాలుగయిదు నెలలయ్యాక కృష్ణమోహన్ మా ఇంటికి వచ్చి, నవ్వుని, సంతోషాన్ని అతి ప్రయత్నం మీద ఆపుకుంటూ, ''సౌమ్య నా కో పాపాయి నివ్వ బోతూందండీ'' అన్నాడు. నా ఆనందానికి అంతులేదు. ముఖ్యంగా ఆ స్థితిలో కృష్ణను చూస్తూంటే నా మనస్సు పులకితమయింది. 'ఎంతగా ఎదురుచూశాడో పిచ్చితండ్రి! ఇంతగా పరవశమవుతున్నాడు!' అని నా మనస్సు ప్రేమతో, అభిమానంతో పొంగిపోయింది. చెమ్మగిలిన కళ్లతో ''చాలా సంతోషమండీ. కానీ ఆ ముద్దు నాకు రాయలేదేం?'' అన్నాను. కృష్ణమోహన్ తియ్యగా నవ్వి ఊరు కున్నాడు. సౌమ్య నా కీ శుభ వార్త ను ఇన్నాళ్ల వరకు ఎందుకు చెప్పలేదు అన్న బాధను దాని కోరిక తీర బోతూంది కదా అన్న తృప్తి జయించివేసింది.

స్వయంగావెళ్లి సౌమ్యను చూసివద్దా మనుకున్నాను. కానీ పిల్లల పరీక్షలు, అత్త గారి హఠాన్మరణం, బంధు వులు, పరామర్శలు నన్ను కదలనివ్వలేదు.

ఈ మధ్య సౌమ్య సంగతులేవీ తెలియలేదు. కృష్ణమోహన్ కూడా హైద్రాబాదు రాలేదు. వస్తే మమ్మల్ని చూడకుండా వెళ్లడు. సౌమ్యకు ఎన్ని ఉత్తరాలు వ్రాసినా జవాబు రాలేదు. నేనే వెళదామని అనుకుంటున్నాను.

అంతలో ఉన్నట్లుండి ఈ ఉదయం సౌమ్య పసి వాణ్ణి భుజాన వేసుకుని ప్రత్యక్షమయింది! నన్ను నేను మరిచిపోయాను!

సౌమ్య చేతిలో పసను అందుకుంటూ, ''రా, సౌమ్యా'' అన్నాను తన్ను పొదివి పట్టుకొని లోపలికి నడిపిస్తూ. సౌమ్య చాలా మారిపోయింది. బుగ్గలు లోతుకు పోయాయి. జుట్టు చాలా వరకు ఊడిపోయింది. కళ్లచుట్టూ నల్లని గీతలు. ముఖం కళావిహీనంగా, పేలవంగా ఉంది.

ఎందు కిలా మారిపోయింది? ఏమయింది? పురిటిలో ఏమన్నా జబ్బుచేసిందా? ''ఇదేమిటే, సౌమ్యా, ఒక్క బిడ్డకే ఇలాగయిపోయావు?'' అన్నాను నవ్వుతూ.

సౌమ్య నా ముఖంలోకి, కళ్లలోకి దీర్ఘంగా, పరిశీ లనగా ఏదో వెతుక్కున్నట్లు చూస్తూ, చటుక్కున వంగి నా పాదాలు పట్టుకుంది. నేను ఆశ్చర్యపోయాను. ఇదేమిటి? ఇలా బేలగా అయిపోయిం దీ సౌమ్య? రెక్క పట్టుకుని లేవదీసి, ''ఇదేమిటే, సౌమ్యా?'' అన్నాను.

# చంద్రాలోకం

## దాశరథి

అందరాని జాబిల్లిని
అందుకున్న వేళ
అవనిపైన ఈ అశాంతి
అంతరించ దేల?

గగనాలను గెలుచుకొనే
ఘనమైన వేళ
గజంగజం నేలకొరకు
కలహించుట లేలా?

కాశ్మీరం కబళింపగ
కలలు గనే నొకడు
'త్రివిషపము' దాటిరాగ
తీవరించు నొకడు

శాంతిని వధియించు నొకడు,
చావును బ్రతికించు నొకడు,
తన రంగే మేటిదని
తైతక్కల నాడు నొకడు

పచ్చ కాగితాలమీద
పవ్వళించబోవు నొకడు
పేదల కన్నీటిలోన
ఈది యాడి మురియు నొకడు

బుద్ధపదమే శాశ్వతమని
బుకాయించు నొకడు.

గాలిలోని బంతి, భూమి
నేల గోరు నొకడు

తెచ్చుకొన్న స్వతంత్రతకు
చిచ్చుపెట్ట జూచు నొకడు,

జెండాల నీడలలో
గుండాలను పెంచు నొకడు

ధాన్యం లేకున్న మానె
సైన్యం వుంటే చాలు!
తిండెందుకులే! తుపాకి
గుండుంటే పదివేలు!

దారిద్ర్యం పోగొట్టే
దారి వెదుకవలెను.
మరణమునే గెలువగలుగు
మందును కనిపెట్టవలెను

కుజ శుక్ర గ్రహములతో
బుజం కలుపవలెను
మానవ మేధా శక్తిని
మరింతగా పెంచవలెను

మనిషి మనిషి ద్వేషించని
మార్గం చూతాము
జగతిని సుఖశాంతులు గల
స్వర్గం చేతాము.

సౌమ్య నా చుట్టూ చేతులు వేసి భుజం మీద తల పెట్టుకొని వెక్కివెక్కి ఏడుస్తూంది. ఆ దుఃఖోద్వేగం ఉపశమించేదాకా ఊరుకొని, "ఛా, ఇదేమిటి, సౌమ్యా, ఏడుస్తున్నావెందుకు? నాకు చెప్పవూ?" అన్నాను.

"వాసవీ, నన్ను క్షమిస్తావా? క్షమించానని అను, వాసవీ! అంతవరకు నాకు నిష్కృతి లేదు" అంది.

ఈ సారి నిజంగా నాకు మతి పోయింది. తను ఏం చేసిందని నేను క్షమించాలి? పిచ్చిపిల్ల! ఇన్నాళ్ళూ ఉత్తరం రాయకుండా నన్ను తికమక పెట్టింది. దానికే క్షమాపణలూ, నిష్కృతులూనా? సౌమ్యకు కాస్త ఉద్రేకపుపాలు ఎక్కువ. చిన్నప్పటి నుంచీ అంతే. పెళ్ళయి, తల్లి అయినా అది తగ్గలేదన్నమాట. నాకు నవ్వు వచ్చింది.

నవ్వుతూ "చాల్లే — మరీ పెద్ద పెద్ద మాటలు వాడకు. ఉత్తరాలు రాయలేకపోతేనేం — నందంటి బాబుని చూపించావు. అంతే చాలు. నిన్ను ఎప్పుడో క్షమించేశాను" అన్నాను.

సౌమ్య నీళ్ళు నిండిన కళ్ళతో కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ నుంచుంది.

"స్నానంచేసి, కాఫీ తాగి విశ్రాంతి తీసుకో. ప్రయాణంలో చాలా అలసిపోయావు" అని సౌమ్యను లోపలికి తీసుకువెళ్ళాను.

సౌమ్య మౌనంగా, దిగులుగా తన పనులు పూర్తి చేసుకుని గదిలోకి వెళ్ళి పడుకుంది. సౌమ్య మునుపటిలా లేదు. ఏదో విషయానికి బాధపడుతూంది. ఇది ఇన్నాళ్ళకు యథార్థం. తను కాస్త స్థిమితపడ్డాక వివరంగా విషయాలు తెలుసుకోవాలి అనుకుంటూ వంట చేయడానికి వెళ్ళాను. మధ్యలో ఒకసారి గదిలోకి తొంగిచూశాను. సౌమ్య గోడవైపు తిరిగి ఉంది. భుజం ఎగిరెగిరి పడుతూంది. శబ్దం రాకుండా ఏడవాలని విశ్వప్రయత్నం చేస్తూంది. నేను వెళ్ళి కదిపితే మరీ బావురుమనవచ్చు. ఎందుకిలా కుమిలిపోతూంది? ప్రాణప్రదమైన నా సౌమ్య కేమయింది? నాకు తెలిసినంతవరకు ఏ విషయంలోను తనకు లోటు లేదు. ఏమో, మనస్సంతా బరువుగా భారంగా ఉంది.

ఆయన ఊళ్ళో లేరు. వంట పూర్తిచేసి సౌమ్యను భోజనానికి లేపాను. భోజనంచేస్తూ కూడా ఆట్టే మాట్లాడలేదు. తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో కూర్చుంది. చేయి కడుక్కొని గదిలోకి వెళ్ళింది. నేను అన్నీ సర్ది సౌమ్య దగ్గిరికి వెళ్ళాను. ఆమె హడావిడిగా తయారవుతూంది. అలంకరణ అంతా అసహ్యంగా ఉంది. ఓ వైపు జారిపోతున్న చీర చెంగులు, పక్కకు పోయిన బొట్టు, వంకరటింకరగా చుట్టిన సిగ.

"వసూ, నేను అర్జంటుగా ఓ స్నేహితురాల్ని కలుసుకోడానికి వెళుతున్నాను. కొంచెం ఆలస్యమవుతుందేమో — బాబుని కాస్త చూసుకో" అంది.

"సరేలే — వెళ్ళుగాని కాస్త తిన్నగా ముస్తాబవు" అని బయట కుండీలోని గులాబీ తీసుకురావడానికి వెళ్ళాను.

"త్వరగా రా, సౌమ్యా" అన్నాను గులాబీ సిగలో పెడుతూ.

నా చేయి తీసుకుని ముద్దుపెట్టుకుంటూ, తల ఊపి, మరుగులాంటి నడకతో గేటు తెరుచుకొని కనుమరుగయింది.

రాత్రికి సౌమ్య బాధేమిటో తెలుసుకుని ఊరడించాలి. ఊరికే బెంగపడుతూంది.

ఆలోచనల్లోపడి టైమెంతయిందో గమనించలేదు. పది దాటింది. పిల్లలు నిద్రపోతున్నారు. సౌమ్య ఇంకా రాలేదు. ఈ పూటకి రాదేమో. వాళ్ళు బలవంతం పెట్టి ఉంచేశారేమో. పోన్లే. మాటల్లో పడి కాస్త ఊరట పొందుతుంది. తలుపులన్నీ జాగ్రత్తగా వేసి, సౌమ్య బాబు పక్కన పడుకున్నాను. వాడు చలికి ముడుచుకు పోతున్నాడు. వాడి ఉన్ని బట్టలు పెట్టెలో ఏమైనా ఉన్నాయేమో చూద్దామని లేచి లైటు వేసి సౌమ్య పెట్టె తెరిచాను. మూత తీయగానే నన్ను ఉద్దేశించి రాయబడిన ఓ కవరు ఉంది. నా గుండె భయంతో ఒకసారి జలదరించింది. కాళ్ళు చల్లబడి నిలవలేక పోతున్నాయి. కుర్చీలో కూలబడి వణికే చేతులతో కవరు విప్పి, ఉత్తరం తెరిచాను అతి ప్రయత్నం మీద.

"వాసవీ, ప్రియబాంధవీ,

ఈ ఉత్తరం ఎలా వ్రాయను? ఏమని వ్రాయను? దీన్ని చదివి నీవు ఏమయిపోతావు? కానీ ఉన్నదున్నట్లు తప్పకుండా వ్రాస్తాను. ఈ జీవన సంధ్యలో నా కెలాంటి సంకోచమూ, వెరపూ లేదు. అందులో నీ విషయంలో నా కేనాడూ లేదు. నీవు నా ప్రాణానివి. నీకు చెప్పకపోతే ఇంకెవరికి చెబుతాను? అసలు నా కింక ఎవరున్నారు? నా భయాలు, నా బరువులు, నా వేదనలు, బాధలు, పాపాలు అన్నీ నీకు నివేదించి నేను క్షాళితురాలి నవుతాను. వాసవీ! ఈ ఉత్తరం పూర్తిచేశాక నీవు ఏమను కుంటావు? నన్ను గురించి ఎలా అభిప్రాయపడతావు? నీవు ఏమనుకున్నా నేను వినబోను. అది నాకు చేరదు. నీవు ఈ ఉత్తరం అందుకునేసరికే మార్ఫియాతో నా శరీరం నిండిపోయి ఉంటుంది. మృత్యు ద్వారంలోకి ప్రవేశించే ఉంటాను. కానీ, వసూ, నా ప్రియసోదరీ, నన్ను అసహ్యించుకోకు. చీదరించుకోకు. చనిపోయినా నా ఆత్మకు శాంతి ఉండదు — నేను భరించలేను. నా కోసం — రెండు కన్నీటి బొట్లు రాల్చు, వాసవీ! పాపపుణ్యాల బేరీజు భగవంతుని న్యాయస్థానంలో. భగవంతుడి శాపనార్థాలకు నేను భయపడను. కానీ నీవు మటుకు శపించకు, వాసవీ! మొదటినుంచి ప్రేమించటం మటుకే తెలిసిన నీవు నన్ను నిర్దయగా దూషించవు. నాకు తెలుసు. కానీ నేను నీ దాంపత్య జీవితంలోకి విషబిందువులా . . . వాసవీ, క్షమించు. మొదటినుంచి సవిస్తారంగా వ్రాస్తాను. చదువు —

కృష్ణ నేను గర్భవతినని చెప్పాడని నీవు నన్ను కోప్పడుతూ ఉత్తరం వ్రాశావు. ఉత్తరంతోపాటు నా కిష్టమయిన పచ్చళ్ళు, వేగోడీలు, నెయ్యి ఉండలు, నీకు గుర్తున్నవన్నీ చేసి పంపావు. అవి చూసి నా మనస్సు సిగ్గుతో, బాధతో, పశ్చాత్తాపంతో చితికి పోయింది. అమృతమయమైన నీ స్నేహానికి నేను అర్హురాల్ని కానని నా మనస్సు ఆక్రోశించింది. నీ ప్రేమను భరించే శక్తి ఎప్పుడో లుప్తమయిపోయింది, వాసవీ! వసూ, నా కడుపులో ఊపిరి తీసుకున్న ప్రాణి నీ భర్త రాజశేఖరంగారు దయగా ప్రసాదించిన వరం! వాసవీ, హడలిపోతున్నావు కదూ? నిజం—అదే వసూ! నీకు ఇంకా విపులంగా చెబుతాను.

వసూ, మాతృవాంఛతో నేను దాదాపు పిచ్చిదాన్నయి పోతూ వచ్చాను. ముఖ్యంగా కృష్ణను చూస్తే నాకు వెర్రెత్తిపోయేది. పసివాళ్ళతో ఆడుకునే కృష్ణను చూస్తుంటే నా మనస్సు దహించుకుపోతుండేది. కృష్ణంటే నాకు ప్రాణం. నా కారణంగా కృష్ణ బాధ పడుతున్నాడు. కృష్ణ కోరిక నేను తీర్చలేకపోతున్నాను. కృష్ణ తీరని కోరిక, నా మనోవాంఛ నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. నాలోని ధైర్యం, తెలివితేటలు అన్నీ మాయమయిపోయేవి. కృష్ణ పరిపూర్ణ తృప్తి, ఫలితం పొందాలి. దాంపత్య జీవిత ఫలితం? ఎక్కడ — కనుచూపుమేరలో కనిపించడం లేదు. కృష్ణ పెదవులమీద వెలిగే స్నిగ్ధ, దరహాస చంద్రికలు మాయమయి, నీలినీడలు ఆవరించుకుంటున్నాయని నా అనుమానం, వాసవీ. స్త్రీగా నా మనస్సుని అర్థం


కావలెను

ప్రపంచప్రసిద్ధమైన మా జపాన్ మోడల్ పాకెట్ ట్రాన్సిస్టర్‌కు ఆర్డర్లు సేకరించుటకు నెలకు రు. 450/- లు లేక కమీషను మీద పూర్తిటైం/పార్టుటైం అభ్యర్థులు స్త్రీలు, పురుషులు, కావలెను. శాంపిల్ సెట్టుకు వ్రాయండి.

**Employment Officer (A.P.V.-88)**
**Box 1564, Delhi-6.**



మన ఆనందమునకు పరమావధి ఆరోగ్యము నిరోగమయిన శరీరము ఆనంద నిలయము వ్యాధిని నిరోధించు శక్తులు అనంతము - వాటితో పోరాడి గెల్చుటకు

అంబేశ్వర ఆయుర్వేద ఫార్మసీ (రిజిష్టర్డు)

హెడ్డాఫీసు. మారుటేరు, ప. గో. జిల్లా. (ఆం. ప్ర.)

వారి మందులు పూర్తిగా ఆధారపడదగినవి. వెంటనే వ్రాసి సుఖింపుడు.

బ్రాంచి ఆఫీసు : విజయవాడ బీసెంట్‌రోడ్. LIC ఆఫీసు ఎదురుగా.

చేసుకో. నాలో చెలరేగే సముద్ర మథనం నీకు తెలిసింది కదూ. కేవలం కృష్ణకోసమే కాదు, నా కోసంకూడా. నా తపనకు, నిరీక్షణకు అంతు లేకపోయింది. ఒక్కోసారి ప్రపంచంలో పిల్లలనే వాళ్ళే లేకుండా చేయాలని కసి పుట్టుకు వచ్చేది. పిల్లల్ని, పిల్లల తల్లుల్ని చూస్తే, అంతు లేని ఈర్ష్యాసూయలు బయలుదేరేవి. పిల్లలతో కృష్ణ కనిపిస్తే చాలు, కయ్యుమని లేచి పోయేదాన్ని. కృష్ణ ఏమనేవాడో తెలుసా, 'అమ్మా పెట్టదు, అడుక్కో నివ్వదూ —' అనేవాడు నవ్వుతూ. ఆ నవ్వు నన్ను కోటి ముక్కలు చేసినట్టు, లక్ష గొంతులతో అపహాస్యం చేసినట్లు వినిపించేది.

నీవు అనారోగ్యంగా ఉన్నప్పుడు మనం హార్స్లీ వెళ్లాము, గుర్తుందా? నీతో వచ్చేటప్పుడు ప్రమాణ పూర్తిగా చెబుతున్నాను నా కెలాంటి దురుద్దేశ్యమూ లేదు. నీకోసమూ, నా మానసిక శాంతికోసమూ బయలుదేరాను. ఒక రోజు మనం షికారుకని బయలు దేరాము. అంతలో నీవు తలనొప్పని మానుకున్నావు. మానేసినదానివి ఊరుకోకుండా మమ్మల్ని బలవంతం చేసి పంపావు. నీకేం తెలుసు, వాసవీ — నా మనస్సులో ఎన్ని విషనాగు లున్నాయో?—నీలా నా మనస్సంతా స్వచ్ఛమైన పాలతో నిండి ఉందనుకున్నావా? వాసవీ, ఏ పాశవిక శక్తి నన్ను ఆడించిందో చెప్పలేను. ఏ దురదృష్ట దేవత నన్ను వెంటాడిందో తెలియదు. నీ స్నేహం, నీ పట్ల నా ప్రేమ ఏమయిపోయిందో అంతుబట్ట లేదు. నా చదువు, నా విజ్ఞానం, నా శిక్షణ, నా సంస్కారం అన్నీ మాయమయిపోయాయి. నాలో మానవత్వం నశించి పశుత్వమే మిగిలింది. వెనకా ముందూ ఏ ఆలోచనా లేకుండా రాజశేఖరంగారిని నవ్వించాను. కవ్వించాను. ఓడించాను. మగవాడు, భార్య అనారోగ్యంతో ఉంది. చల్లని చక్కని ప్రకృతి. అందమైన మగువ. పైగా కోరుకుంటున్నది. రాజశేఖరం గారు క్షణిక దౌర్బల్యానికి లోనయ్యారు. నా కోర్కె తీరింది. నాకు సమాజం, స్నేహం, భర్త, ద్రోహం, నీతి, నిజాయితీ ఏమీ దృష్టికి రాలేదు. నా మాతృవాంఛ, తల్లినవాలనే ప్రగాఢమైన కోర్కె — అంతే. కృష్ణకోసం త్యాగం చేశానా? నాకోసం నా స్వార్థం ఇలా చేయించిందా? ఏమో — నేను చెప్పలేను. ఏదైతేనేం? నేను పతితను, స్వామిద్రోహిని; మిత్రద్రోహిని; అంతే.

త్వరలో నా కష్టం ఫలించిందని తెలుసుకున్నాను. వాసవీ, నిజం చెబుతాను, నమ్ముతావా? నేను మనఃస్ఫూర్తిగా ఒక్క నిమిషమున్నా సంతోషపడలేదు. ఆ నాడు ఎందుకలా చేశానో, ఈ నాడు ఎందుకిలా చేస్తున్నానో నన్ను పుట్టించిన ఆ విధాతకు తెలియాలి. ఇక ఆ రోజునుంచి నటించడం మొదలుపెట్టాను. లేకపోతే మటుకు ఏం చెయ్యగలను? కోరి పాపాన్ని కట్టుకున్నాక మోయక తప్పుతుందా? కృష్ణకు, నీకు చెప్పి మీ జీవితాలు నాశనం చేయలేను కదా? — నా విధి మరోలా నన్ను కాటువేయబోతూందని నాకేం తెలుసు, వాసవీ? సరే — తెచ్చిపెట్టుకున్న సంతోషంతో కృష్ణకు శుభవార్త చెప్పాను. కృష్ణ మరునాడు హైద్రాబాదు వచ్చాడు. నీతో ఈ విషయం చెప్పాడు. తరవాత కృష్ణ ఉత్తరం జత చేస్తున్నాను అది చదువు.

'సౌమ్యా,


నీ కిలాంటి ఉత్తరం రాయవలసి వస్తుందని నేను కలలో కూడా భావించలేదు. ఎందుకిలా జరిగిందని నిన్ను అడగటం లేదు. సౌమ్యా, నాకు జీవితంలో కొన్ని సిద్ధాంతాలు, ఆదర్శాలు ఉన్నాయి. నాకు పాతివ్రత్యం మీద అంతులేని నమ్మకం. ఆడదైనా, మగవాడైనా ఏ ఒక్కరికో మనస్సైనా, శరీరమైనా ఇవ్వాలి. ఆ విషయాల్లో సరిపెట్టుకోడాలు, సర్దుకుపోడాలు నేను సహించలేను. వ్యభిచారిణిని నేను భార్యగా భరించలేను; ఆదరించలేను. ఏ పరిస్థితులు అందుకు దోహదం చేశాయో, నా కనవసరం. వినే ఓపికా, ఆసక్తి రెండూ లేవు. సౌమ్యా, ఇప్పటికి అర్థమయిందా? మరో పురుషుడి చేతిలో నలిగి, గర్భవతివై తిరుగుతున్న నిన్ను ఈ కళ్ళతో చూడలేను. ఈ చేతులతో స్పర్శించలేను. మనకు ఇక భవిష్యత్తు లేదు. నేను నీ జీవితంలో నుంచి శాశ్వతంగా నిష్క్రమిస్తున్నాను. నా కోసం ప్రయత్నించకు. నా కంఠంలో ప్రాణం ఉండగా నా ముఖం నీకు కనబడదు. నీ ముఖం నేను చూడను. మన బంధం తెగి తునాతునకలయిపోయింది.

నీ పాపం ఎలా బయటపడిందా అని ఆశ్చర్య పోతున్నావా? నీవు చెప్పిన మాట విన్నాక నేనేమై పోయానో నాకు తెలియదు. కోటి జ్యోత్స్నలు వెలిగినట్లు, వేయి వీణలు మీటినట్లు — ఇంకా ఏమేమో అనిపించింది. నా ఆనందం నీవు కళ్లారా చూచావు. చక్కగా అభినయించావు. సౌమ్యా, నిన్ను నా ప్రాణంగా ప్రేమించాను. ఈ ఆఖరి నిమిషంలో నిన్ను పరుషంగా తిట్టి బాధించలేను.

నీ ప్రాణ స్నేహితురాలు వాసవిగారికి ఈ మాట చెప్పి బయటికి వచ్చాను. నీవు హైద్రాబాదులో ఉన్నప్పుడు పిల్లలు పుట్టలేదని ఏమైనా లోపం ఉండేమోనని డి. ఎన్. సి. అని, పేటెన్సీ టెస్ట్ అని ఏవేవో చేయించుకున్నావు. నన్ను కూడా పరీక్ష చేయించుకోమని రెండు మూడు సార్లు సూచించావు కానీ బలవంతం చేయలేదు. సున్నితమైన ఈ విషయాల్లో నీవు ఎంతో ఉదాత్తంగా ప్రవర్తించేదానివి. నేనూ ఉపేక్షించి ఊరుకున్నాను. కానీ క్రితంసారి హైద్రాబాద్ వచ్చినప్పుడు ఓ మిత్రుని బలవంతంవల్ల నారాయణగూడా లాబ్‌కి వెళ్లి పరీక్ష చేయించుకున్నాను. కానీ ఆ రిపోర్టు తీసుకునే శ్రద్ధ లేకపోయింది. వాసవి గారింటి నుంచి బయలుదేరాక ఆ విషయం గుర్తు వచ్చింది. పరీక్ష చేసిన డాక్టరుగారికి కృతజ్ఞత తెలపడం నా కనీస ధర్మమని భావించి, అక్కడకు వెళ్లి రిపోర్టు తీసుకున్నాను. దానిలో "ఏస్పెర్మియా" అని ఉంది. నీవు డాక్టరువి. నీకు ఇంకా బాగా అర్థమవుతుందను కుంటాను. అంటే నాకు సంతానం కలగదు! నా భార్య వైన నీకు పిల్లలు పుట్టే అవకాశం లేదు! కానీ ప్రియమైన, సౌమ్యా, నీవు గర్భవతివి! సెలవు — ఈ జీవితానికింతే —

—కృష్ణమోహన్.'

కృష్ణకోసం ఎదురుచూస్తున్న నాకు ఈ ఉత్తరం అశనిపాతంలా, పిడుగులా వచ్చి పడింది. అయిపోయింది! భర్త, వైవాహిక జీవితం – అన్నీ ముగిసిపోయాయి. ఎలా భరించాననుకుంటావు, వాసవీ? నా బాధ మాటలకు, రాతలకు అందనిది. అంతకన్నా ఎక్కువగా ఏం వ్రాయను?



"ఝుండా ఊంచా రహే హమారా"
చిత్రం—కె. వి. వి. సుబ్రహ్మణ్యం
(రాజమండ్రి-1)

రెండుమూడుసార్లు ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నించాను. కానీ, అప్పుడే కదులుతున్న శిశువు, అంతరాంతరాల్లో దాగి ఉన్న మమత నన్నా పని చేయనివ్వలేదు. కృష్ణ వ్యాపార రీత్యా ఉత్తర దేశం పోయాడని నీలాంటి వాళ్లని నమ్మించాను. కానీ అసలు విషయం బయటకు పొక్కనివ్వలేదు.

బాధో, శాంతో, నిర్లిప్తతో, నిర్వేదమో తెలియని మానసిక స్థితిలో నవమాసాలు మోసి వాణ్ణి కన్నాను. వాసవీ, ఇప్పుడు నా బిడ్డపై నాకు రోత లేదు. అసహ్యం లేదు. పైగా, అంతులేని ప్రేమ; అనురాగం! కానీ నా వాసవీ, నేను కృష్ణ లేనిదే ఇక బ్రతకలేను. నాకు కృష్ణ కావాలి. కృష్ణ లేకుండా నా జీవితానికి, నా ఉనికికి అర్థం లేదు. మరో జన్మలోనైనా కృష్ణని కలుసుకు తీరుతాను. అందుకే వెళ్లిపోతున్నాను. కృష్ణ లేని ప్రపంచం నాకు వద్దు. అనుక్షణం జ్ఞాపకం వచ్చే కృష్ణ స్మృతి, కృష్ణ ప్రేమ నన్ను పిచ్చిదాన్ని చేస్తున్నాయి. వసూ, ఈ చిత్రహింస ననుభవిస్తూ బ్రతకడం కన్నా ఇది మేలు కదూ? కృష్ణ నన్ను అప్పుడన్నా క్షమిస్తాడంటావా?

వాసవీ, నన్ను నీవు మన్నించకపోయినా ఫరవాలేదు. కానీ తుచ్ఛమైన, నీతిలేని ఈ సౌఖ్యంకోసం హాయిగా సాగిపోతున్న నీ జీవిత నౌకను, మీ సంసారాన్ని ఛిన్నాభిన్నం చేయకు, వాసవీ. ఈ కడసారి కోర్కె తీర్చవూ?

నా బాబుని — నీకు దయగలిగితే నీ పిల్లలతోపాటు పెంచి పెద్దచేయి. లేదా ఏ అనాథ శరణాలయానికో అప్పగించు. నా కున్నదంతా వాడికి చెందేలా వీల్నామా చేయి. సెలవు, వాసవీ! వచ్చే జన్మలో కూడా నీ స్నేహాన్ని, కృష్ణ ప్రేమను పొందాలని ఆశిస్తూ, కన్నీళ్లతో, క్షమాపణలతో, ప్రేమతో —

—నీ సౌమ్య." ★